క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



పొన్నూరు: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ వీరా నాయక్ అన్నారు. నిడుబ్రోలులో ప్రజలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. గొడవలకు పాల్పడినా, ప్రోత్సహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యలు ఉంటే శాంతియుతంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. శాంతి భద్రతలు పరిరక్షించేందుకు మేమున్నామని అన్నారు. ప్రజలు కలిసిమెలిసి జీవిస్తేనే పట్టణంలో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లల భవిష్యత్తుపై దృష్టి సారించాలని కోరారు. విద్యార్థులు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జూదం, సైబర్ నేరాల నియంత్రణ, రోడ్డు భద్రతను పాటించి కుటుంబాలను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీహరి, పోలీసులు పాల్గొన్నారు.

గుండెపోటుతో విశ్రాంత వీఆర్వో మృతి



వెంకట రంగారావు(ఫైల్)

పెదకాకాని: సుదీర్ఘ కాలం వెనిగండ్ల వీఆర్వోగా పనిచేసిన కొండా వెంకట రంగారావు(70) ఆదివారం గుండెపోటుకు గురై మృతి చెందారు. గ్రామంలో కరణంగా పనిచేసిన ఆయన మునుసుబు, కరణంల వ్యవస్థ రద్దు చేసిన తరువాత వీఆర్వోగా పనిచేశారు. పెదకాకాని మండల ప్రజలకు సుపరిచితుడైన రంగారావు మృతి పట్ల పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ ఉద్యోగులు సంతాపం తెలియజేశారు. సోమవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పెదకాకాని: అన్నదాత సుఖీభవ పథకానికి రైతులు మంగళవారం లోపు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి తెలిపారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో సొంత భూమి కలిగిన రైతుల పేర్లు నమోదు చేయడం జరుగుతుందన్నారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ జిరాక్స్, అడంగల్ పత్రాలతో వీఏఏ వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలని, పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

తండ్రీకుమారులపై అట్రాసిటీ కేసు

పెదకాకాని: కులం పేరుతో దూషించడంతో పాటు బెదిరించిన ఘటనపై తండ్రి, ఇద్దరు కుమారులపై కేసు చేశారు. ఈ ఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కూచిపూడి సతీష్ వ్యాన్ డ్రైవరుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సతీష్ ఏప్రిల్ 24న తన వాహనం నడుపుతూ వస్తుండగా ఇంటికి సమీపంలోని మలుపు వద్ద ద్విచక్రవాహనం అడ్డుగా ఉంది. దాన్ని పక్కకు తీసే క్రమంలో ద్విచక్రవాహన యజమాని షేక్ మస్తానీతో గొడవ జరిగింది. అనంతరం షేక్ మస్తానీ, తండ్రి షేక్ బాబు, సోదరుడు షేక్ షమ్మీలు సతీష్ ఇంటికి వెళ్లి కులం పేరుతో అసభ్యంగా దూషించారు. అంతు చూస్తానని బెదిరించడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. న్యాయం కోసం ఉన్నతాధికారులను ఆశ్రయించడంతో నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరిష్కార వేదిక నేడు

పొన్నూరు: పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యక్రమం జరగనుందని అన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా అందజేయాలని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రంలో ఆదివారం మార్నింగ్ స్టార్ కళాశాల సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిరంగిపురం నుంచి గుంటూరు వెళుతున్న కారును ప్రమాదవశాత్తు గుంటూరు నుంచి నరసరావుపేటకు వెళుతున్న ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో ఇరువురినీ గుంటూరులోని ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. క్షతగాత్రుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

పెద్దలకే.. పెద్దపీట..

- సామాన్య భక్తులకు రిక్తహస్తం...
- హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కొంత మందికే ఆర్జిత సేవలు
- ఆలయ ఆదాయానికి భారీ గండి



ఆంజనేయస్వామి దేవస్థానం



ఒక భక్తుడి నుంచి రూ.5,116 చందా రాసిన రశీదు

పట్నంబజారు: అనుకున్నదే అయింది.. మరోసారి పెద్దలకే... పెద్దపీట దక్కింది.. నాజ్‌సెంటర్‌లోని శ్రీ అభయాంజనేయస్వామి సాక్షిగా సామాన్య భక్తులకు రిక్తహస్తం మిగిలింది. ప్రతి ఏటా ఆంజనేయస్వామి జయంతిని పురస్కరించుకుని అనేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.. అయితే గత కొద్ది సంవత్సరాలుగా 'హనుమాన్ దీక్షా సమాజం' పేరిట పూజా కార్యక్రమాలు ఏకపక్షంగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీక్షా సమాజం పేరుతో ఉన్న రిజిస్ట్రేషన్ కూడా పూర్తి అయిందనే వాదనలు వినవస్తున్నాయి.

1985 నుంచి దీక్షా సమాజం..

దేవస్థానంలో 1985 నుంచి దీక్షా సమాజం పేరుతో సేవా కార్యక్రమాలు చేయటం ప్రారంభించారు. గత కొద్ది సంవత్సరాల నుంచి ఒక ప్రైవేట్ వ్యక్తి దీక్షా సమాజం పేరుతో గుడిలో అంతా తానై వ్యవహరిస్తున్నారు. 2019 నుంచి దీక్షా సమాజం రిజిస్ట్రేషన్ రెన్యువల్ లేకపోవటం, ఇష్టానుసారంగా సొంత కమిటీని ఏర్పాటు చేసుకుని వసూలుకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. 41 రోజుల పాటు ఆంజనేయ దీక్షా స్వాములకు అన్నదానం చేస్తారు. 41 రోజుల పాటు దీక్షా సమాజానికి రోజుకో దాత ఉన్నారనే సమాజం సభ్యులు స్పష్టంగా చెబుతున్నారు. అయితే కమిటీ మాత్రం విరాళాలు వసూలు చేస్తున్నారు. లక్షలాది రూపాయలు దాతల నుంచి తీసుకుని కేవలం కొద్ది మేరకు మాత్రమే ఖర్చుపెట్టి, ఆలయాన్ని వారి ఇంటిలా వాడుకుంటున్నారనే అపవాదులు లేకపోలేదు. సుమారుగా రూ.12 లక్షల నుంచి 15 లక్షలకుపైగా వసూలు చేస్తున్నారని దీక్షా సమాజం సభ్యులే చెబుతున్నారు.

మళ్లీ చక్రం తిప్పారు..

ఉత్సవాల్లో భాగంగా 18వ తేదీన విశేష పూజలు, 19న పలు పూజలతో పాటు ముఖ్యంగా జరిగే లక్ష తులసీపూజ, 20న లక్షల మల్లెల పూజ, 21 లక్ష ఆకుపూజ, గ్రామోత్సవం, 22వ తేదీన శ్రీమద్ హనుమజ్జయంతి రోజున సహస్ర ఘట్టాభిషేకం, 22న సువర్చల ఆంజనేయస్వామి కల్యాణం నిర్వహించనున్నారు. అయితే 19వ తేదీన జరిగే లక్ష తులసీపూజ, 20న జరిగే లక్షల మల్లెల పూజ, జయంతి రోజున జరిగే సహస్ర ఘట్టాభిషేకానికి మరో భక్తులకు అవకాశం లేకుండా కేవలం కొంత మంది వ్యక్తులు మాత్రమే చేస్తుండడంపై భక్తులు మండిపడుతున్నారు.

సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఏదీ..?

సామాన్య భక్తులకే ప్రాధాన్యం లేకుండా పోయింది. పదేళ్ల పైబడి ఆలయానికి ఒక్క రూపాయి కూడా కట్టకుండా ఇష్టానుసారంగా దీక్షా సమాజం వ్యవహరించింది. ఈ ఏడాది మాత్రమే రూ.50 వేలు చెల్లించింది. అదీ కూడా కేవలం ఘట్టాభిషేకానికి మాత్రమే. ఇందులోకి ఆలయ ప్రధాన అర్చకుడు, సిబ్బంది కీలక పాత్ర పోషించి, ఇతర అభిషేకాలు, హోమాలకు సంబంధించి డబ్బులు కైంకర్యం చేశారనే ఆరోపణలున్నాయి. కొత్తగా వచ్చిన లాలాపేట గ్రూప్ ఆలయాల అసిస్టెంట్ కమిషనర్(ఏసీ)ని కూడా అర్చకులు, సిబ్బంది తప్పుదోవ పట్టిస్తున్నారని దీక్షా సమాజం సభ్యులు ఆరోపిస్తున్నారు. సహస్ర ఘట్టాభిషేకానికి మరి కొంత మంది స్వచ్ఛందంగా డబ్బులు కట్టి పాల్గొంటామని చెప్పినా.. ఈ ఏడాది కుదరదని, వచ్చే ఏడాది నుంచి చూస్తామని ఆలయ అధికారులు చెప్పటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రతిది లెక్క చెబుతాం..

ఏడు సంవత్సరాలుగా దీక్షా సమాజం రిజిస్ట్రేషన్ రెన్యువల్ లేనిది వాస్తవమే. దీక్షా సమాజం పేరుతో తీసుకున్న ప్రతి ఒక్క దానికి లెక్కలు చూపిస్తాం. అయితే కొన్ని సంవత్సరాలకు సంబంధించి కొన్ని లెక్కలు సరి చూడాల్సి ఉంది. భక్తులు, దాతలు, దీక్షా సమాజం సభ్యులకు లెక్కలు చెబుతాం.

–టీవీ సుబ్బారావు, దీక్షా సమాజం, గౌరవాధ్యక్షులు

ఈ ఏడాది గమనిస్తాం

నేను ఆలయ అధికారిగా బాధ్యతలు చేపట్టి కొద్ది కాలమే అయింది. ఈ క్రమంలో హనుమత్ జయంతిని జరిగే విధానాన్ని పూర్తిగా పరిశీలిస్తాం. వచ్చే ఏడాది నుంచి భక్తులకు ఏ విధంగా అవకాశం కల్పించాలో గమనించి చర్యలు తీసుకుంటాం. ఈ ఏడాదికి కేవలం కొద్ది మందికి మాత్రమే ఘట్టాభిషేకం, ఇతర పూజా కార్యక్రమాల్లో అనుమతి ఉంది.

–టి.సుభద్ర, లాలాపేట గ్రూప్ ఆలయాల ఏసీ

అవోపా ఆధ్వర్యంలో రూ.50 లక్షల ఉపకార వేతనాలు



పెన్షన్లు పంపిణీ చేస్తున్న అవోపా రాష్ట్ర, నగర ప్రతినిధులు, అతిథులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్యవైశ్య అఫీషియల్స్–ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు జూలైలో రూ.50 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు తెలిపారు. ఆదివారం అరండల్‌పేటలోని అవోపా కార్యాలయంలో 108 మంది పేదలకు నెలవారీ పెన్షన్లు పంపిణీ చేశారు. అవోపా గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో రాంబాబు మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ప్రతినెలా 108 మంది పేదలకు రూ.500 చొప్పున పెన్షన్ పంపిణీ చేయడంతో పాటు విద్యార్థులకు ఉపకార వేతనాలు, ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, వసతి కల్పిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాచపూడి సుబ్బారావు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు ఉచితంగా మందులు పంపిణీ, ప్రతివారం గో సేవ నిర్వహించటం అభినందనీయమని అన్నారు. మహిళా విభాగ అధ్యక్షురాలు చింతా వసంత కల్పన మాట్లాడుతూ మహిళలకు వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెలా పెన్షన్ల పంపిణీలో భాగంగా ఈనెల పెన్షన్ పంపిణీ నిమిత్తం రూ.60 వేలను చలువాది ఆదినారాయణ విరాళంగా అందేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అవోపా కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్, పెన్షన్ కన్వీనర్ వెంకట్రావు, మట్టుపల్లి రవికుమార్, నాళం కృష్ణకుమారి, రంగారత్న శ్రీ, మద్ది కోటి రత్నం పాల్గొన్నారు.

ఆయుర్వేదంపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఆయుర్వేద వైద్యులు నాగేంద్రం

లక్ష్మీపురం: ఆయుర్వేదం అనేది ఒక వైద్య విధానం మాత్రమే కాదని జీవన శైలి కూడా అని, శరీరం మనస్సు, ఆత్మ సమతుల్యతను కాపాడంపై ఆయుర్వేదం దృష్టి పెడుతుందని ఆయుర్వేద వైద్యులు డాక్టర్ పి.వి.నాగేంద్రం అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్యసభ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ వ్యాధుల మూలాలను తెలుసుకుని రోగ ఉపశమనం కన్నా రోగ నివారణకే ప్రాధాన్యం ఇచ్చే ఆయుర్వేదం సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని చెప్పారు. తనకు కలుగుతున్న బాధలను నివారించుకోవటానికి ప్రకృతిలో లభ్యమవుతున్న అనేక వృక్ష ఖనిజ, రసాయన పదార్థాల పరిశోధన ఫలితమే ఆయుర్వేదమన్నారు. వెన్ను సంబంధిత వ్యాధులు అయిన సయాటిక సర్వికల్ స్పాండిలైటిస్‌లు 95 శాతం సర్జరీలు అవసరం లేకుండానే ఆయుర్వేద చికిత్సల ద్వారా తగ్గించుకోవచ్చన్నారు. ప్రస్తుతం ఆయుర్వేదంలో పంచకర్మ విధానం బాగా ప్రసిద్ధి చెంది ఉందని ఈ విధానం ద్వారా కండరాలు, నరాలకు సంబంధించిన అనేక వ్యాధులకు విముక్తి కలుగుతుందని చెప్పారు. సమతుల్య ఆహారం, వ్యాయామం ఆరోగ్యకరమైన జీవన శైలి గురించి ఆయుర్వేదం వివరిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేంద్రను సత్కరించారు.

చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు

- నగరంపాలెం సీఐ నజీర్ బేగ్
- రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నజీర్ బేగ్

లక్ష్మీపురం: రౌడీ షీటర్లు మంచి నడవడికతో ఉండాలని చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు కఠిన తరంగా ఉంటాయని నగరంపాలెం సీఐ నజీర్ బేగ్ హెచ్చరించారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. తొలుత ప్రతి ఆదివారం సంతకం చేసేందుకు వస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్న ప్రదేశాల్లో స్టేషన్ రౌడీషీటర్ల ప్రమేయం ఉన్నట్లు తెలిస్తే సహించేది లేదన్నారు. ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా స్టేషన్‌కు సంతకానికి రావల్సిందిగా కోరారు. రౌడీషీటర్లపై పూర్తి నిఘా ఉందన్న విషయాన్ని మరవొద్దని చెప్పారు. ప్రధానంగా సెటిల్‌మెంట్లు, బెదిరింపులు, రౌడీ కార్యకలాపాలు నిర్వహించినట్లు గాని మద్యం తాగి స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు చిన్న సమాచారం వచ్చిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్టేషన్ పరిధిలో సిబ్బందికి అందుబాటు ఉండాల్సిందిగా దూర ప్రాంతాలకు వెళ్లాలంటే కచ్చితంగా స్టేషన్ ఎస్‌హెచ్ఓ అనుమతి ఉండాలన్నారు.

ఆచార్య నాగవరప్రసాద్‌కు సత్కారం



నగరంపాలెం: సృష్టి, స్థితి, లయకారుడు విశ్వకర్మ భగవానుడే అని ఉత్కల్ విశ్వ విద్యాలయం సంస్కృత విశ్రాంత విభాగాధిపతి చంద్రపాటి నాగవరప్రసాద్ అన్నారు. సీతారాంనగర్ వికాస తరంగిణి సేవా భవనంలో ఆదివారం ఏపీ దేశీయ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మేధోమదన సదస్సు నిర్వహించారు. దేశీయ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు కందుకూరి శ్రీనివాససుధాకర్‌బాబు అధ్యక్షత వహించారు. నాగవరప్రసాద్ మాట్లాడుతూ విశ్వకర్మను ఆరాధించే వారంతా వైశ్వకర్మనులేనన్నారు. ధర్మపీఠం రాష్ట్ర సంచాలకులు తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు మాట్లాడుతూ వైశ్వకర్మలు పంచవృత్తుల కన్న అనాది కాలం నుంచి రుషి వేద సంస్కృతి జీవన విధానంగా ఉండే వారని అన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి జంపని రాధాకృష్ణమూర్తి, యోగి మహేశ్వరానంద, కేఎస్‌వీ ప్రసాద్, పోలీస్ అధికారి ముళ్లపూడి రాజా, ఇంజినీర్లు కందుకూరి వెంకట్రావు, అత్తలూరి శ్రీధర్, డాక్టర్ బాలబ్రహ్మాచారి, ఎ.వీరబ్రహ్మం, రావణబ్రహ్మ, అద్దంకి భద్రయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆచార్య నాగవరప్రసాద్‌ను సత్కరించారు. తొలుత అద్దంకి పూర్ణిమ హరీష్ దంపతులతో శాస్త్రోత్తంగా విశ్వకర్మ యజ్ఞం నిర్వహించారు.

పట్టణంలో విజిబుల్ పోలీసింగ్

మంగళగిరి టౌన్: విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలన్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం మంగళగిరి పట్టణంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించినట్లు మంగళగిరి పట్టణ సీఐ వినోద్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజిబుల్ పోలీసింగ్‌తో ప్రజల భద్రతకు భరోసా ఉంటుందన్నారు. వాహనాల తనిఖీలు చేపట్టి రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనం నడిపేవారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణీలకు ఆటోలో తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మోటారు వాహన చట్టం ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కేసులు నమోదు చేశామని, విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ట్రిపుల్ రైడింగ్, వాహనాలకు సరైన నెంబర్ ప్లేట్లు, రికార్డులు లేకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న వారిని, లైసెన్స్ లేని వారిని గుర్తించి జరిమానా విధించామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు గుర్తించిన బ్లాక్‌స్పాట్‌ల వద్ద స్పీడ్ బ్రేకర్‌లను సూచించేలా హెచ్చరికల బోర్డులు గమనించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రవీంద్రనాయక్, సిబ్బంది ఏడుకొండలు, బాబూరావు, సుధీర్, వెంకటరావు, శివయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌కి సంఘీభావంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ అనూరాధ

మంగళగిరి టౌన్: 'ఆపరేషన్ సిందూర్'ను విజయవంతం చేసిన సైనిక దళాలకు సంఘీభావంగా ఆదివారం మంగళగిరి నగరంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. కూటమి నాయకులు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నుంచి మెయిన్‌బజార్, గాంధీచౌక్ వరకు జాతీయ పతాకాలతో తిరంగా ర్యాలీలో పాల్గొన్నారు. 'భారత్ మాతాకీ జై' అంటూ ప్రతి ఒక్కరు నినాదాలు చేశారు. యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ మాట్లాడుతూ.. ఉగ్రదాడికి వ్యతిరేకంగా, ఉగ్రవాదులను అణచడానికి భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం గర్వకారణమని అన్నారు. దేశ, సరిహద్దుల రక్షణలో అహర్నిశలు నిమగ్నమైన మన సైనికులకు సంఘీభావం తెలపాలన్నారు. సైన్యానికి ఎలాంటి నష్టం జరగకుండా చాకచక్యంతో పాక్ ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశారన్నారు. ఈ ఘనత నిస్సందేహంగా సైనికులదేనని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, కూటమి నాయకులు, విద్యార్థులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

తాడేపల్లి రూరల్: రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై మంగళవారం జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని ఇప్పటం గ్రామంలో రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షన సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో శివశంకరరావు మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర లభించడం లేదని, మిర్చి, పొగాకు ధరలు లేక రైతులు విలవిలలాడుతున్నారని, పెసలు, మినుములు, శనగలకు గిట్టుబాటు ధర లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రక్షించే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నామన్నారు. తాడేపల్లి మండల అధ్యక్షులు మోదుగుల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ పంట కాలువలోకి మురుగు నీరు కలవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పంట కాలువలో మురుగును అరికట్టాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో రైతులు, కౌలురైతులు తదితరులు పాల్గొన్నారు.

దేవుని మహిమలు ఎనలేనివి

ఫిరంగిపురం: దేవుని మహిమలు ఎనలేనివని విచారణ గురువులు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో ఆదివారం ప్రత్యేక శ్రీసభ దివ్యపూజాబలి నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి వాక్యోపదేశం చేస్తూ ప్రతి ఒక్కరూ దేవునితో భక్తితో మెలగాలని, ప్రేమతత్వాన్ని కలిగి ఉండాలని చెప్పారు. ఆత్మఫలాలైన ప్రేమ, ఆనందం, శాంతి, విశ్వసనీయత, నిగ్రహం, శాశ్వతరం, సహనం, మంచితనం ప్రతి ఒక్క విశ్వాసునిలో ఉండాలన్నారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



పట్నంబజారు: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు... ఆదివారం సాయంత్రం ఒక యువకుడు మణిపురం ఓవర్ బ్రిడ్జిపై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పాత గుంటూరు పీఎస్ ఎస్ఐ షేక్ రెహమాన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు బిహార్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియరాలేదని చెప్పారు. ఏదైనా పనులు చేసుకుని జీవించేందుకు ఇక్కడికి వచ్చి ఉంటాడని భావిస్తున్నారు. సదరు యువకుడు మద్యం మత్తులో బ్రిడ్జిపై నుంచి కిందపడి మృతి చెందాడా, ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనేది దర్యాప్తులో తెలియాల్సి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్

నెహ్రూ నగర్: గుంటూరు నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి సోమవారం డయల్ యువర్ కమిషనర్(0863–2224202) కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు కమిషనర్ చాంబర్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని చెప్పారు.

సుప్రీంకోర్టుకు ప్రశ్నలు.. రాజ్యాంగంపై మరో దాడి

లక్ష్మీపురం: తమిళనాడు శాసనసభ ఆమోదించిన బిల్లులకు గవర్నర్ సమ్మతి తెలపకుండా ఏళ్ల తరబడి తొక్కి పెట్టిన వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును చిత్తశుద్ధితో అమలు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ద్వారా ప్రశ్నలు సంధించటం సబబు కాదని కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేట అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం విలేకరు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ చర్య సుప్రీంకోర్టు తీర్పు నుంచి కేంద్రం తప్పించుకో చూస్తుందన్న విమర్శల్ని ఎవరూ కొట్టిపారేయలేరన్నారు. వాస్తవానికి దేశ సర్వోన్నత న్యాయస్థానం రాజ్యాంగం యొక్క సమాఖ్య స్వభావాన్ని, రాష్ట్రాల హక్కుల్ని పరిరక్షిస్తూ ఆ తీర్పుని వెలువరించిందని తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద నేటి ధర్నా వాయిదా

లక్ష్మీపురం: తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించాల్సిన ధర్నాను వాయిదా వేస్తున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి కోట మల్యాద్రి తెలిపారు. స్థానిక కొత్తపేట జిల్లా సీపీఐ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక



మంగళగిరి/ మంగళగిరి టౌన్: ఈనెల 31వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు ఒంగోలులో జరిగే ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ (మెన్, ఉమెన్) ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ పోటీలకు గుంటూరు జిల్లా తరుపున క్రీడాకారులను ఆదివారం మంగళగిరి ఫిట్‌జోన్ జిమ్‌లో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధానిలు మాట్లాడుతూ.. గుంటూరు జిల్లా వ్యాప్తంగా మహిళా పవర్ లిఫ్టర్స్ 15 మంది, మెన్ పవర్ లిఫ్టర్స్ 11 మంది కలిపి మొత్తం 26 మంది హాజరయ్యారని తెలిపారు. హాజరైన వారిలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ మెన్ అండ్ ఉమెన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ టీమ్‌లను ఎంపిక చేశామని అన్నారు. ఎంపికైన క్రీడాకారులను గుంటూరు జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్ ఆర్.ఎన్.వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్లు బి.ప్రసాద్, భాస్కరావు, బొలినేని చంద్రిక అభినందించారు.

గుంత తీశారు.. వదిలేశారు



అమరావతి రోడ్డులో తీసిన గుంత

నెహ్రూ నగర్ : అమరావతి రోడ్‌లో వారం రోజులు క్రితం పైప్ లైన్ పనుల నిమిత్తం గుంత తవ్వి వదిలేశారు. గుంతలోనికి మురుగు నీళ్లు చేరి మురుగు వాసనకి చాలా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి గుంత పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు వెస్ట్)
9912220356
Office mail : sakshigntadvt@gmail.com